# ఆలయంలేని దేవత

అంత వరకూ తన కిరణ స్పర్శతో లోకాన్ని జాగృతం చేసిన సూర్యుడు మెల్లిగా కొండల వెనక్కి తప్పుకుంటున్నాడు. అయినా అంతటితో రవి కిరణాల పని అయిపోదు. చంద్రుడి పైన తమ కాంతిని ప్రసరింపజేసి, చంద్రికతో విభావరులను కూడా అందంగా తయారు చేస్తాయి. అయితే లోకానికి చంద్రుడు పదిహేను రోజులే కనిపిస్తాడు. అయితే నేం ఆ కొన్నాళ్ళూ ఆనందా న్నిస్తాడు.

శివరామయ్య రిటైర్ అయ్యేది ఆ రోజే. కళాశాలలో వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు విద్యార్థులు, అధ్యాపకులు. ఆయన్ని పుష్పమాలాలంకృతుణ్ణి చేసి, ఆయన సేవలను కొనియాడారు. సభ అన్ని వీడ్కోలు సభల్లాగానే ఉంది.

కానీ కొంత ప్రత్యేకత ఉంది దీనికి. శివరామయ్య గారంటే విద్యార్థి




లందరికీ మక్కువ ఎక్కువ. ఆయన పాఠాలను బోధించే తీరు వాళ్ళని ఆకట్టుకునేది. చదవక పోయినా ఆయన వాళ్ళని నిందించే వాడు కాదు. మంచిగా చెప్పి చదివేలా చేసేవాడు. నిజానికి ఆయన చెప్పిన పాఠం మళ్ళీ చదవ నవసరం లేదు. ఏకాగ్రత ఉన్న వాళ్ళకు, కాస్త బుర్ర ఉన్న వాళ్ళకు ఆ ఒక్కసారి వింటే చాలు. అందుకే ఆయ నంటే అందరికీ ఇష్టం. ప్రిన్సిపాలు గారూ, అధ్యాపకులూ కూడా ఆయన్ని ఎంతో పొగిడారు.

తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞత చెప్పడానికి లేచిన శివరామయ్యకు కంఠం గాద్గదికం కావడంతో మాట రాలేదు. ముప్ఫయి అయిదేళ్ళ కళాశాల జీవితంలో ఒక రోజూ ఆయన సెలవు పెట్టలేదు. అధ్యాపకు డంటే భావి పౌరులను తీర్చి దిద్దేవాడు. అందు వల్ల అతను ఆదర్శంగా ఉండాలి. చీటికీ, మాటికీ అవసరం ఉన్నా లేకపోయినా సెలవు పెట్టడం, క్లాసుకు ఆలస్యంగా వెళ్ళడం- ఇవన్నీ చేయకూడదని ఆయన అభిప్రాయం.

ఒకసారి ఆయన కూతురికి జబ్బు చేస్తే ఆస్పత్రికి తీసి కెళ్ళడానికి సెలవు పెట్టమని అడిగింది పార్వతమ్మ.

"పార్వతీ, అమ్మాయికి మందివ్వలసిన వాడు డాక్టర్. పాపకు నేను తండ్రయితే, నీవు తల్లివి. ఇద్దరి బాధ్యతా ఒక్కటే. కాకుంటే ఈ పరిస్థితిలో నీవే బాగా చూసుకోగలవు. మన డాక్టరు గారుండగా భయ మెందుకు? నా అవసరం ఇక్క డుండదు. కానీ నేను సెలవు పెడితే ఈ రోజు ఎంతో మందికి నేను చెప్పవలసిన విషయాలు వాయిదా పడతాయి. విద్యార్థులను అనవసరంగా రోడ్ల మీదికి పంపిన వాణ్ణవుతాను. పాఠమూ, నేను చెప్ప దలచుకొన్న మంచి విషయాలూ పోయి, వాళ్ళు ఏ సినిమాకో వెళ్ళి, ఏ చెడో నేర్చు కుంటే, ఆ సంఘటన వల్ల వాళ్ళ జీవితాలే తారుమారు కావచ్చు. మరెందు వల్ల నైనా వాళ్ళ జీవితం లోనికి ఏదో దుష్టశక్తి ప్రవేశించవచ్చు. ఈ రోజు ఐదు గంటలు వాళ్ళు కాలేజీలో గడపాలి. అందులో ఒక గంట వాళ్ళ భవిష్యత్తులో ఏ చెడుకో త్రోవ తీస్తే అందుకు నేను బాధ్యుణ్ణవుతాను కదా?" అన్నా డాయన.

పార్వతమ్మ కోపంతో నమస్కారం పెట్టి "మహా ప్రభో! నేను మీ ఉపన్యాసం వినలేను. వెళ్ళి మీ విద్యార్థులకే ఇచ్చుకోండి" అని వెళ్ళి పోయింది.



"ఉత్త పిచ్చిది. చిన్న జ్వరానికే భయపడి పోయింది -" నవ్వుకున్నాడు శివరామయ్య.

ఈ ఆలోచనలన్నీ తనను చుట్టు ముట్టాయి. వీడ్కోలుకు సమధానం చెప్పి కళాశాల సింహ ద్వారం దాటి ఆవరణలోకి వచ్చాడు శివరామయ్య.

ఒక్కసారి కళాశాల భవనం వైపు తేరిపార చూశాడు. ఆయన కళ్ళు నీళ్ళతో నిండాయి. ఎన్ని ఏళ్ళ అనుబంధం? కేవలం భవనంతోనే కాదు. పిల్లలతో, స్నేహితులతో కొన్ని వేల మంది జీవితాలకు ఈ భవనంలో పునాది పడింది. దాంట్లో తనకూ భాగస్వామ్యం ఉంది. ఎంతో మంది ఉన్నతోద్యోగులుగా, చక్కటి గృహస్థులుగా, గృహిణులుగా తయారయ్యారు.

పూర్వ విద్యార్థి వార్షి కోత్సవాలకు విద్యార్థినీ, విద్యార్థులు వచ్చినపు డంతా తనతో ఎంతో ఆత్మీయంగా మాట్లాడి వెళ్తారు. తన కప్పు డెంతో గర్వంగా ఉంటుంది. ఇక ఇప్పుడు తన కా అవకాశం పోయింది. గాఢంగా నిట్టూరుస్తూ ఇంటిదారి పట్టాడు శివరామయ్య.

స్నానం, భోజనం కానిచ్చి రాత్రి మేడ పైకి ఎక్కాడు. దశమి చంద్రుడు మనోహరంగా ఉన్నాడు. సూర్య కిరణాలు పడి చంద్రుడు ఇంత చల్లదనాన్ని సంపాదిస్తాడు. ఆశ్చర్యమే మరి!

శివరామయ్యకు రమణి ఉత్తరంలోని విషయాలు గుర్తొచ్చాయి. తన సమాధానం చేరి ఉంటుంది. రేపే ఆ ఊరికి వెళ్ళాలి. రమణి తన కోసం కాచుకుని ఉంటుంది. రమణీ అంతే. తను కష్టాలు పడి ఇతరులకు ఆనందాన్నిస్తుంది. రమణిని గురించి ఆలోచిస్తూ ఉండిపోయాడు శివరామయ్య.


రమణి శివరామయ్య విద్యార్థిని. ఆ వీధిలోనే ఉన్న సుబ్బారావు కూతురు. పావం, చిన్నప్పుడే తల్లి పోవడం, తండ్రి అనారోగ్యం, తల్లి వైపూ, తండ్రి వైపూ ఎవరూ లేకపోవడం, దరిద్రం, అనారోగ్యం అన్నీ కలిసి రమణిని రాటు దేల్చాయి. నిజానికి మరెవ రైనా అయితే ఇలాంటి పరిస్థితుల్లో డీలాపడి పోయే వారు. కానీ రమణి వ్యక్తిత్వం స్థిరమైంది. ఎవరి నైనా సరే లెక్కపెట్టదు. ముక్కుకు సూటిగా పోతుంది. ఆమెకు శివరామయ్య క్లాసంటే ఎంతో ఇష్టం. ఏ పరిస్థితిలోనూ ఆ క్లాసుకు గైరు హాజరయ్యేది కాదు. కానీ రమణి పరీక్షల్లో చాలా మార్లు ఫెయిలయ్యింది. తండ్రి బలవంతం వల్ల "ఆఖరిసారిగా కడ్తాను. ఇక కట్ట"నని ఆ సంవత్సరం పరీక్ష ఫీజు కట్టింది.

సరిగ్గా పరీక్ష ముందు రోజు సుబ్బారావు మరణించాడు.

చూడటానికి వెళ్ళిన శివరామయ్యతో "రేపు నేను పరీక్ష రాస్తాను మాస్టారూ" అన్నది రమణి.

శివరామయ్య ఆశ్చర్యపోయాడు. ఏం చెప్పాలో తోచలేదు. పరీక్ష ఉదయం పూట ఎనిమిది గంటల నుంచి పదకొండు గంటల వరకు ఉంటుంది. ఇంట్లో తండ్రి శవం పెట్టుకుని ఈ అమ్మాయి పరీక్ష ఎలా రాస్తుంది?

దిగ్భ్రాంతి చెందిన శివరామయ్యను చూసి, పేలవంగా నవ్వి "నేను బాగా ప్రిపేరయ్యాను మాస్టారూ? గంటన్నరలో రాసేస్తాను -" అన్నది. ఆమె ధైర్యానికీ, స్థైర్యానికీ విస్తుపోయాడు శివరామయ్య.




అన్నట్టుగానే రమణి పరీక్ష రాసింది. చిత్రం. పాసయింది కూడా.

"నాన్న కోరిక తీర్చాను మాస్టారూ! ఆయన ఆత్మ శాంతించి ఉంటుంది" అంది రమణి.

అవన్నీ గుర్తు చేసుంకుటూ చాలాసేపు మేడ పైన కూర్చున్నాడు శివరామయ్య. మెల్లిగా క్రిందికి దిగి వచ్చి ముందు గదిలో టేబుల్ పైన ఉన్న రమణి ఉత్తరం తీసి చదివాడు.

"పూజ్యులైన మాస్టారు గారికి, రమణి చేయు నమస్కారాలు. ఇన్నేళ్ళుగా మీకు ఉత్తరం వ్రాయ నందుకు మన్నించండి. మీరు వెంటనే ఈ ఊరికి ఒకసారి రావాలి. ఇది నా అభ్యర్థన. 30వ తేదీకి మీ రిక్కడుండాలి. బహుశా నా గురించిన వార్తలు మీ దాకా వచ్చే ఉంటాయి. ఎటొచ్చీ మీరు వాటిని నమ్మి ఉండరు. నమ్మినా, నమ్మకపోయినా జరిగే విషయాలు జరుగుతూ ఉంటాయి మంచి పని చేయాలని ప్రారంభిస్తే ముందు చెడే ఎదురౌతుంది. అమృతం కోసం పాల సముద్రం మధిస్తే హాలా హలం ముందు పుట్ట లేదూ? సరి .... అవన్నీ ఎందుకు గానీ ఇంక ఈ ఉత్తరం చాలిస్తాను. మీ రాకకు ఎదురు చూచు - రమణి."

ఉత్తరం మడిచి బల్ల సొరుగులో పెట్టాడు శివరామయ్య. ఏమిటో ఈ అమ్మాయి ఒక పజిల్. రమణిని గురించి ఏవేవో చెబుతూంటారు. కానీ అంత గొప్ప వ్యక్తిత్వం గల రమణిని గూర్చి లోకులు ఏదో వాగుతూంటే తను బాధపడ్డాడు. నిజం ఎలా తెలుస్తుంది? అయినా రమణి దేనికి, ఎవరికీ జంకదు. ఆమె ఏ తప్పూ చేయదని తన నమ్మకం.

శివరామయ్య నిద్ర కుపక్రమించాడు.

* * * * * *

మరు దినం ఊరికి ప్రయాణమయ్యాడు శివరామయ్య. స్టేషన్‌కు విద్యార్థులు, అధ్యాపకులు అందరూ వచ్చారు. పూర్వ విద్యార్థులూ వచ్చారు. వాళ్ళలో ఉన్నతోద్యోగు లెందరో ఉన్నారు. వాళ్ళందరినీ చూస్తే ఎంతో గర్వంగా ఉంటుంది. వాళ్ళకు డిగ్రీ రావడానికి, ఉద్యోగం దొరకడానికి తను ఒక్కడూ చెప్పిన చదువే కారణం కాకపోయినా వాళ్ళు "మీరు చెప్పిన చదువే మాస్టారూ!" అంటే తన కెంతో గొప్పగా ఉంటుంది. 'ఈ దేశానికి ఇటువంటి పౌరున్ని ఇచ్చాను' అని ఉప్పొంగి పోతాడు.

గమ్యం చేరాలనే ఆత్రతతో రైలు పరుగు తీసింది.

భగవంతుని దయలా వెన్నెల అంతటా నిండి ఉంది. వెలుగులో వెనక్కి పరుగుదీస్తున్న చెట్లు, దూరంగా కనిపిస్తున్న కొండలు, గుట్టలు. అక్క డక్కడా నీటి గుంటలు. ఎంతో మనోహరమైన ప్రకృతిని పరికిస్తూ కూర్చున్నాడు శివరామయ్య. రైలు స్టేషను వచ్చి నప్పుడంతా ఆగుతుంది. దిగే వాళ్ళు దిగుతున్నారు. గమ్యం రాని వాళ్ళు కాచుకుని కూర్చున్నారు- జీవితంలో లాగే. శివరామయ్యకు పార్వతమ్మ గుర్తొచ్చింది. "పార్వతీ, ఎందుకని ముందు స్టేషన్‌లోనే దిగిపోయావు?" ఆయన మనసు ఆక్రోశించింది. జ్ఞాపకాలు పరుగెత్తుతున్న చెట్లలా, బాధలో స్థిరంగా ఉన్న కొండల్లా ఎంతోసేపు కూర్చుండిపోయాడు అలా.

తెల్లవారుజామున తాను దిగవలసిన స్టేషను రాగానే గబగబా దిగాడు శివరామయ్య.

"మాస్టారూ! ఇటు, ఇటు." పిలుపు వినిపించింది.

ఒక్క క్షణం ఆశ్చర్యపోయి నిలబడి పోయాడు శివరామయ్య. రమణి. ఎదురుగుండా నిలబడి ఉంది. స్టేషన్‌లోని దీపాల కాంతితో ఆమె నవ్వు కలిసి పోయింది. పాపను ఎత్తుకుని ఉంది.

"నమస్కారం మాస్టారూ!" రమణి మళ్ళీ నవ్వుతూ అంది. పాపా నమస్తే చెప్పమ్మా" అంది. పాప కూడా 'నమస్తే' చెప్పింది.

శివరామయ్య ఆశ్చర్యం నుంచి తేరుకో లేదు. "ఇదేమిటి, అర్ధరాత్రివేళ నువ్వు స్టేషన్‌కు రావాలా?" అన్నాడు.

"అదేమిటి మాస్టారూ! మిమ్మల్ని రిసీవ్ చేసుకో ననుకున్నారా? స్టేషన్‌కు రాకుండా ఎలా ఉంటాను చెప్పండి?" అన్నది రమణి ముందుకు నడుస్తూ.

ఆమెను అనుసరించాడు శివరామయ్య.

తనదే పొరపాటు. రమణి ధైర్యం తను మరచిపోయాడు. అర్ధరాత్రి పూట ఆడపిల్ల స్టేషన్‌కు రావటమా అన్న ప్రశ్న మామూలు ఆడ పిల్లలకు. రమణి కది వర్తించదు అనుకున్నాడు.

స్టేషన్ బయట జట్కా ఉంది సిద్ధంగా. ఇద్దరూ ఎక్కారు.

దారంతా ఏదేదో చెబుతూ ఉంది రమణి. తన బుర్రలో ఒకటే ప్రశ్న. ఈ పాప ఎవరు? రమణి బిడ్డేనా? తను రమణిని గురించి విన్న విషయాలు నిజమేనా?

"ఇల్లొచ్చింది మాస్టారూ! దిగండి-" రమణి మాటలు శివరామయ్యను ఈ లోకంలో పడేశాయి.

ఆ చిన్న ఊళ్ళో, ఊరికి కాస్త దూరంగా, విశాలమైన స్థలంలో అందంగా కట్టిన పెంకుటిళ్ళు, పూరిపాకలు, కుటీరాల చుట్టూ అందమైన తోట.

గేటు తీసుకుని లోపలికి ప్రవేశించాడు.

ఇల్లు విశాలంగా ఉంది. అక్కడే ఉన్న కుర్చీ చూపి కూర్చోమంది రమణి. బ్రెడ్, పళ్ళు తెచ్చి తినమన్నది. తను వద్దని మంచినీళ్ళు, మజ్జిగ తాగాడు. "రామూ, మాస్టారి పడకను ఇంకొకసారి సరిచేయి." అని కేకేసింది రమణి.

ఒక పధ్నాలుగేళ్ళ అబ్బాయి లోపల్నుంచి వచ్చి "సరి జేశానమ్మా" అన్నాడు.

మంచం మీద నడుం వాల్చగానే గాఢంగా నిద్ర పట్టేసింది శివరామయ్యకు.

* * * * * *

ఉదయం మెలకువ వచ్చేసరికి ఏవో దేశ భక్తి గేయాలు వినిపిస్తున్నాయి. కిటికీ లోంచి చూస్తే సుమారు ఇరవై ముప్పయి మంది పిల్లలు వరసగా నిలబడి పాటలు పాడుతున్నారు. అ లేత ఎండలో ఆ చిన్నారులు పూల మొక్కల్లా ముగ్ధ మనోహరంగా ఉన్నారు.

శివరామయ్య లేచాడని గమనించిన రాము పరుగెత్తుకుంటూ వచ్చి ఆయనకు స్నానాదికాలకు ఏర్పాటు చేశాడు. కాఫీ, టిఫిన్ అమర్చాడు. అతని చురుకుతనానికి ఆశ్చర్యపోయాడు శివరామయ్య. ఒక దీపంతో ఎన్ని దీపాలైనా వెలిగించ వచ్చు అనుకున్నా డాయన.

ఈ లోగా రమణి వచ్చింది. "రండి మాస్టారూ! మా సామ్రాజ్యం చూద్దురు గాని" అంది.

నిజమే. మకుటం లేని మహారాణిలా ఉంది రమణి. ఆమెలో ఏదో తేజస్సు,

ఆమె ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలు కాలేదు. అదైనా ఎన్నోసార్లు ఫెయిలై చివరికి మామూలు బి.ఎ. డిగ్రీ తెచ్చుకుంది. ఉన్నతోద్యోగం అంత కంటే లేదు. కానీ ఏదో గొప్పతనం ఆమెలో. ఎంతో గొప్ప స్థానాల్లో ఉన్న తన పూర్వవిద్యార్థులను చూస్తే గర్వం కలిగేది తనకు.

కానీ ఇప్పుడు కలిగిన భావం వేరు. అది ఏమిటి?

అక్కడున్న కుటిరాలన్ని చూశాడు శివరామయ్య. రమణి వివరిస్తోంది. ఒక్కో కుటీరానికి ఒక్కో పేరు. దేశ భక్తులవి, నాయకులవి. టీచర్లు పాఠాలు బోధిస్తున్నారు. చెట్ల నీడలో కొందరు పిల్లలు ఆడుకొంటున్నారు. అందమైన పూల మొక్కలతో, అంత కన్నా అందమైన చిన్నారులతో ఆ ప్రదేశం ఆహ్లాదకరంగా ఉంది.

శివరామయ్యలో ఇదంతా తన విద్యార్థిని చేస్తున్న పని అని గర్వం. ఆనందం.

తను ఇక్కడికి రావడం, పాఠశాల పెట్టడం అంతా వివరంగా చెప్పింది రమణి. పాప సంగతి మాత్రం చెప్పలేదు.

ఆ మధ్యాహ్నం భోజనాలయ్యాక ఈజీ ఛెయిర్‌లో కూర్చున్నాడు శివరామయ్య.

"వెళ్ళి ఆడుకోమ్మా!" అని పాపను అక్కడి నుంచి పంపేసింది రమణి.

"మాస్టారూ మీ అనుమానం తీర్చాలి నేను. ఎవరికి చెప్పక పోయినా పరవా లేదు కానీ మీకు చెప్పకపోతే అది క్షమించరాని నేరమవుతుంది."

రమణి ప్రారంభించింది. శివరామయ్య ఏమి వినవలసి వస్తుందో అన్నట్టు నిటారుగా అయ్యాడు.

"నే నీ ఊరికి వచ్చిన కొత్తలో మా పక్కింట్లో ఒక యువతి ఉండేది. అప్పటికే ఆమెకు పతిత అన్న ముద్ర ఉండేది. ఆమె నాతో చాలా స్నేహం పెంచుకొంది. ఈ ఊరిలోని పెద్ద మనుషులు కూడా చాటు మాటుగా ఆమెను తను సరదాలకు ఉపయోగించుకునే వారు. కానీ వాళ్ళ· కెవరికీ లేని అంటరానితనం ఈమెకు మాత్రం ఎందుకో అర్థం కాలేదు నాకు.

తమ భర్తలను కాపాడుకోలేని స్త్రీలు ఈమెను నిందించే వారు. అన్నిటినీ భూదేవిలా సహించింది ఆమె.

ఆమె కూతురే పాప. పాప పుట్టగానే ఆమె చనిపోయింది. కానీ ఆమె శవాన్ని ముట్టుకోవడానికి కూడా ఎవరూ రాలేదు. అప్పుడు నేను ఈ రాము సహాయంతో ఒక బండిలో ఆమెను పెట్టి శ్మశానానికి తీసుకెళ్ళి దహనసంస్కారం చేశాను."

శివరామయ్య ఆశ్చర్యంగా వింటున్నాడు. రమణి ఎంత ఎత్తు ఎదిగింది! ఈమెకు తను చెప్పిన చదు వెంత? తాను కేవలం డిగ్రీ కోసం చెప్పాడు. కానీ వ్యక్తిత్వం ఇవ్వలేదు.

"రమణీ! నీ ముందు నేను అతి సామాన్యుడినమ్మా! నీ ఔదార్యం ఎంతో గొప్పది" అన్నాడు ఆర్ద్రంగా.

రమణి దరహాసం చేసి, "ఇదంతా మీ చలువ వల్ల ఏర్పడ్డ వ్యక్తిత్వమే మాస్టారూ -" అంటూ లోపలికి వెళ్ళి ఒక నోటు పుస్తకం తెచ్చి శివరామయ్య కిచ్చింది. ఆ పుస్తకంలో ఏవేవో వాక్యాలు కొన్ని అండర్ లైను చేసి ఉన్నాయి.

"ఏమిటమ్మా ఇది?" ఆశ్చర్యంగా అడిగాడు. "క్లాసులో మీరు చెప్పే విషయాలను ఇలా రాసి పెట్టుకున్నాను. ఎప్పుడూ ఇవి చదువు కుంటూంటాను. ఒకసారి మీరన్నారు. వ్యక్తిత్వం పెంచేదే చదువు అని వివేకానందస్వామి అన్నారని. నాకు నచ్చిన పని చేయడానికి నేను జంకను. ఎవరి కారణంగానో మోసపోయిన స్త్రీ, చచ్చిపోయాక కూడా అపవిత్రురా లెలా అవుతుంది? అందుకే ఆమెకు దిక్కు నయ్యాను. ఆమె కూతుర్ని పెంచే బాధ్యత తీసుకున్నాను. ఈ పనుల వల్ల నేను కొందరికి చెడ్డదా న్నయ్యాను. నన్ను వివాహం చేసుకుంటానని చెప్పిన రవి ఈ పాపను వదిలేస్తే చేసుకుంటా నన్నాడు. నేను ఒప్పుకో లేదు."

జీవితాన్ని కూడ పణంగా పెట్టి తను అనుకున్న మంచి పనిని చేస్తోందన్న మాట రమణి!

మ్రింగెడు వాడు విభుడని, మ్రింగెడునది గరళమని తెలిసినా ప్రజలకు మేలు కలుగుతుందని సర్వమంగళ విషాన్ని మింగమని చెప్పింది శివునికి. మంగళ సూత్రాన్ని ఎంతగా నమ్మిందో అని ఆశ్చర్య పోతాడు పోతన.

మరి రమణి? ఒక పతిత కూతుర్ని చేర దీసి పెంచుతోంది. ఇక శివుడికీ, రమణీకి ఏమిటి తేడా? శివరామయ్య ఆశ్చర్యంగా చూస్తున్నాడు రమణిని.

రమణి లేచింది. "పూజా మందిరంలోకి వస్తారా మాస్టారూ?" అంది.

"ఈ ఇంట్లో వేరే పూజా మందిర మెందుకమ్మా? ఇదంతా ఒక ఆలయం." నవ్వుతూ అన్నాడు శివరామయ్య.

రమణి పూజ గది చూపింది. వివేకానందుని చిత్రపటం. "వ్యక్తిత్వం ఇవ్వని విద్య వ్యర్థం" అన్న మాటలు పటం కింద రాసి ఉన్నాయి.

"మాస్టారూ! పాపకు మీరు అక్షరాభ్యాసం చేయ్యాలి" అన్నది రమణి.

"రమణీ! నీ ముందు నేను నిరక్షరాస్యుణ్ణి. నే నింత వరకూ బోధించాను కానీ ఆచరణలో పెట్ట లేదు. నీవే ఆచరించి చూపావు. నీవే నా గురువు." మనస్ఫూర్తిగా అన్నాడు శివరామయ్య.

దేవుడి ముందున్న కంచు దీపాల్లో ఒక దీపం కొండెక్కుతోంది. మరో దీపం తీసుకుని ఆ దీపాన్ని వెలిగించింది రమణి. దీపం ప్రకాశవంతంగా వెలగసాగింది.

*

